క్లుప్తంగా

ఎమ్మెల్యే కన్నాకు ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి పరామర్శ



సత్తెనపల్లి: శస్త్రచికిత్స చేయించుకున్న సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి బుధవారం పరామర్శించారు. ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని పుష్పగుచ్ఛం అందించి ఆకాంక్షించారు.

కుమారస్వామికి సత్కారం



గురజాల : పిడుగురాళ్ల కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కె.కుమారస్వామి నియామకం పట్ల గురజాల కోర్టు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక బార్ అసోసియేషన్‌లో కుమారస్వామిని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గురజాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందపాటి శ్రీనివాసరెడ్డి, చల్లా రామిరెడ్డి, కత్తి చలమరాజు, కర్రా చినకోటేశ్వరరావు, కావూరి రామకృష్ణ, కేవీ నాగార్జున పాల్గొన్నారు.

ఎస్వీ రంగారావుకు ఘన నివాళి



సత్తెనపల్లి: ప్రముఖ నటుడు ఎస్వీ రంగారావు జయంతి వేడుకలు పట్టణంలోని ఎన్టీఆర్ కళాక్షేత్రం ఎదుట బుధవారం ఘనంగా జరిగాయి. బి.సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ రావూస్ వైద్యశాల డాక్టరు వి.కృష్ణంశెట్టి, రాజుపాలెం మాజీ జెడ్పీటీసీ మర్రి వెంకట్రామిరెడ్డి, నరిశెటి తాండవకృష్ణలు ప్రసంగించారు. ఎస్వీఆర్ నటనను కొనియాడారు. ముందుగా ఎస్వీ రంగారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కళాకారులు గంగూరి వెంకట్రావు, బత్తుల సుధాకర్, తోట ఏడుకొండలు, దివ్వెల శ్రీనివాసరావు, కేదారి రమేష్, శిఖ ఆదాం, రామిసెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే ల్యాబ్‌ల నిర్వహణ

సత్తెనపల్లి: పట్టణంలో నిబంధనలకు అనుగుణంగానే ల్యాబ్‌ల నిర్వహణ ఉందని ల్యాబ్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ నాసర్ బాషా, కార్యదర్శి గడ్డం వీరాంజనేయులు పేర్కొన్నారు. అసోసియేషన్ సర్వసభ్య సమావేశం బుధవారం పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాసర్ బాషా మాట్లాడుతూ పట్టణంలో అన్ని ల్యాబ్‌లకు అనుమతులు ఉన్నాయని చెప్పారు. కొంతమంది సామాజిక మాధ్యమాల్లో అసత్య ఆరోపణలు చేస్తున్నారని, ఇది సరైనది కాదని ఖండించారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

మూగజీవాలకు వ్యాధి నిరోధక టీకాలు



క్రోసూరు: పశుసంవర్ధకశాఖ నిర్వహిస్తున్న మూగజీవాలకు నీలిరంగు నాలుక వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం బుధవారం మండల వైద్యులు డాక్టర్ సీహెచ్ మల్లయ్య ఆధ్వర్యంలో జరిగింది. మండలంలోని బయ్యవరం, ఊటుకూరు, దొడ్లేరు గ్రామాల్లో టీకాలు వేశారు. బయ్యవరంలో 800, ఊటుకూరులో 200, దొడ్లేరులో 200 జీవాలకు నివారణ టీకాలు వేసినట్లు వైద్యులు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెల్లపశువులకు ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాలు కూడా వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గోపాలమిత్రలు, సిబ్బంది పాల్గొన్నారు.

డయేరియా నివారణపై అవగాహన

రాజుపాలెం: ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పరిశుభ్రతపై బుధవారం అవగాహన కల్పించారు. మండలంలోని గణపవరం, రెడ్డిగూడెం, నెమలిపురి మండల పరిషత్ పాఠశాలల్లో డయేరియా నివారణ చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ అధికారి అలేఖ్య, ఏఎన్ఎంలు ప్రమీల, నాగమణిలు ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు శుభ్రతపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఐదేళ్లలోపు చిన్నారులు డయేరియా బారిన పడకుండా సూచనలు చేశారు. పిల్లల తల్లులకు డయేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఉపాధ్యాయులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు విమల, దీవెన, సంతోషం, ఎస్తేర్‌రాణి, పద్మ పాల్గొన్నారు.

పంట సాగులో సూక్ష్మపోషకాలే కీలకం

- అవి లోపిస్తే దిగుబడిపై ప్రభావం
- భూసార పరీక్షల ద్వారానే వీటి లోపాన్ని గుర్తించవచ్చు
- ఇష్టానుసారం రసాయన ఎరువులు, పురుగు మందులు వాడరాదు



రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

దాచేపల్లి : పంటల సాగులో సూక్ష్మపోషకాలు ప్రధాన భూమిక పోషిస్తాయి. పంటల పెరుగుదలకు.. అధిక దిగుబడులకు సూక్ష్మపోషకాలు కీలకంగా ఉంటాయి. ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్ అందుబాటులో ఉన్న పంటల్లో సూక్ష్మ పోషకాల లోపాలు ఉంటే దిగుబడులు గణనీయంగా తగ్గే అవకాశాలు ఉన్నాయి. పంటల సాగులో సూక్ష్మపోషకాల లోపం ప్రధాన సమస్యగా మారింది. పంటల సాగులో సూక్ష్మపోషకాల లోపాన్ని గుర్తించలేక పంటలను ఆశించే తెగుళ్ల, చీడపీడల నివారణకు ఇష్టానుసారంగా రసాయన ఎరువులు, పురుగు మందులను వాడుతూ నష్టాలను చవిచూస్తున్నారు. భూసార పరీక్షలు చేయటం ద్వారా సూక్ష్మపోషకాల లోపాన్ని, వాటి స్థాయిని గుర్తించవచ్చును. సూక్ష్మపోషకాల లోపాలను గుర్తించి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

జింక్ ధాతువు

పత్తి విత్తనం విత్తిన మూడు వారాల తర్వాత జింక్ లోపం కనిపిస్తుంది. ఆకుల మధ్యభాగంలో పాలిపోయినట్లుగా కనిపిస్తాయి. తుప్పు పట్టినట్లుగా కనిపించే మచ్చలు ముదురు ఆకులపై నుంచి లేత ఆకులపైకి విస్తరిస్తాయి. ఆకులు పెలుసుగా మారతాయి. పత్తి, వరి, మొక్కజొన్న, జామ, టమాటా, మిరప, పెసర, మినుము పంటల్లో జింక్ ధాతువు లోపాలు ఏర్పడతాయి. పంటల్లో జింక్ లోపాలు గుర్తిస్తే.. 3 నుంచి 5 గ్రాముల జింక్ సల్ఫేట్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.



దొండేటి పాపకుమారి, ఏవో, దాచేపల్లి

పత్తి, మొక్కజొన్న, వేరుశనగ సాగు చేసే రైతులు ముందుగా ఎకరానికి 20 కిలోల జింక్ సల్ఫేట్‌ని భూమిలో వేయటం వలన మంచి ఫలితం ఉంటుంది. పైరుపై జింక్ లోపం కనిపించగానే లీటర్ నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ కలిసి 5 రోజుల వ్యవధిలో 3 సార్లు పిచికారీ చేయాలి.

ఇనుప ధాతువు

ఆకుల్లో పత్రహరితం తయారు కావటానికి ఇనుము ప్రధాన ఆధారం. ఇది పిండి పదార్థం తయారీకి ఉపయోగపడుతుంది. ఆకుల ఈనెలు ఆకుపచ్చగా ఉండి మధ్య భాగంలో పసుపుపచ్చగా మారి తర్వాత తెలుపు రంగులోకి మారతాయి. వరి, వేరుశనగ పంటల్లో దీని ప్రభావం ఉంటుంది. వాటర్‌షెడ్ ప్రాంతాల్లో ఈ ధాతువు లోపం అరటి, నిమ్మ, మామిడి, దానిమ్మ వంటి పంటల్లో కనిపిస్తుంది. బావులు, బోర్లు, ఇతర సాగునీటిపారుదల కింద పంటల్లో ఈ లోపం కనిపిస్తే 5 గ్రాముల ఐరన్ సల్ఫేట్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. పంటలు వేసే భూమిలో ఎకరాకు 15 నుంచి 20 కిలోల వరకు ఐరన్ సల్ఫేట్ వేసుకుని నివారించవచ్చును.

రాగి ధాతువు

ఆకుల చివరి భాగాల్లో పాలిపోయినట్లుగా ఉంటాయి. ఆకులు పెలుసుగా ఉండి చీలిపోతాయి. ఈ ధాతువు లోపం వరి, చెరకు, వేరుశనగ, శనగ, దానిమ్మ, మల్లెల్లో కనిపిస్తుంది. లోపం ఉన్నట్లయితే 5 గ్రాముల మైలుతుత్తంను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

బోరాను లోపం

బోరాను లోపిస్తే మొగ్గ చనిపోతుంది. లేదా మొక్కకు వస్తున్న ఆకులు పాలిపోతాయి. ఆకులు మొద్దుగా మారతాయి. వంకర్లు తిరిగి పెలుసుగా ఉంటాయి. గోధుమ రంగు కొరడాలాగా కూడా ఉండవచ్చు. పండ్లు పగులుతాయి. బెండువారిన పండ్లు తయారవుతాయి. అరటిలో గెల బరువు తగ్గి కాయలు చిన్నగా ఏర్పడి పగుళ్లు వస్తాయి. అరటి, నిమ్మ, టమాటా, క్యాబేజి, బొప్పాయి, జామలో బోరాను లోపం కనిపిస్తుంది. మొక్కలు నాటుకునే ముందు 20 గ్రాముల బోరాను వేసుకోవాలి. నాటిన తర్వాత అయితే 2 గ్రాముల బోరిక్ యాసిడ్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మాలిబ్డినం

ఆకులు లేత ఆకుపచ్చ రంగులో ఉండి మచ్చలతో కనిపిస్తాయి. ఎక్కువగా క్యాబేజి, క్యాలిఫ్లవర్‌లో మాలిబ్డినం లోపాలు కనిపిస్తాయి. పంట వేసే ముందు 40 గ్రాముల అమ్మోనియం మాలిబ్డినేటు వేయాలి. ప్రస్తుతం ఉన్న ఈ పంటల్లో 30 గ్రాముల అమ్మోనియం మాలిబ్డినేటుని 500 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆమ్ల నేలల్లో అయితే సున్నం వేసి పీహెచ్ పెంచటం ద్వారా మాలిబ్డినం లభ్యతను పెంచుకోవచ్చును.

మాంగనీసు

మాంగనీసు లోపం ఏర్పడినప్పుడు ఆకుల ఈనెలు ఆకుపచ్చగా ఉండి మధ్యభాగం పసుపు పచ్చగా మారి తర్వాత తెలుపు రంగులోకి తిరుగుతాయి. ఈ లోపం ప్రధానంగా అరటిలో కనిపిస్తుంది. దీని నివారణకు 5 గ్రాముల మాంగనీసు సల్ఫేట్‌ను లీటర్ నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో 3 సార్లు పిచికారీ చేయాలి.

లోపం ఈ నేలల్లో ఉంటుంది

నత్రజని, భాస్వరాన్ని అధిక మోతాదులో వాడటం, అధిక సున్నం కలిగిన చౌడు నేలలు, ఎక్కువగా బంకమన్ను కలిగిన నల్లరేగడి భూములు, ముంపు లేక మురుగు భూములు, చలికాలంలో సాగు చేసే రబీ పంటల్లో తరచుగా జింక్ లోపం కనిపిస్తుంది. అధికంగా ఉన్నంగల భూములు, అధిక భాస్వరం కలిగిన భూములు, బైకార్బనేటు ఎక్కువగా ఉన్న సేద్యపు నీటి వాడకం వలన ఇనుప ధాతువు లోపం కనిపిస్తుంది. చౌడు భూములు, ఇసుక, ఇసుక తీర భూముల్లోనూ సాధారణంగా రాగి ధాతువు లోపాలు వచ్చే అవకాశం ఉంటుంది. భూసార పరీక్షలతో సూక్ష్మపోషకాల స్థాయిని తెలుసుకుని వాటికి అనుగుణంగా తగిన చర్యలు తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయి.

సూక్ష్మపోషకాల లోపాన్ని నివారించుకోవాలి

బోరాను, రాగి, మాంగనీసు, మాలిబ్డినం, క్లోరిన్, జింక్, ఇనుము వంటి వాటిని సూక్ష్మపోషకాలు అంటారు. పంటల సాగు కోసం రైతులు ప్రధాన పోషకాలు మాత్రమే వినియోగిస్తుంటారు. సూక్ష్మపోషకాలను వాడటం లేదు. ఈ క్రమంలో నేలలో సూక్ష్మపోషకాల లోపం ఉంటే ప్రధాన పోషక పదార్థాలు సరైన ఫలితాన్ని ఇవ్వవు. అందువలన సూక్ష్మపోషకాల లోపం ఉంటే ఎరువులను వేసుకుని నివారించుకోవాల్సిన అవసరం ఉంది.

ఘనంగా మోటారు బైకు మెకానిక్‌ల దినోత్సవం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని లైమ్ సిటీ టూ వీలర్ మెకానికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మోటారు బైకుల మెకానిక్‌ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మెకానిక్‌లు అందరూ ద్విచక్ర వాహనాలపై భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కి వారి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం వెంకట రత్న ఆటో గ్యారేజ్ వద్ద కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మెకానిక్ అసోసియేషన్ నేతలు మాట్లాడుతూ అసంఘటిత కార్మికులుగా తమను గుర్తించాలని, మెకానికులకు కనీస సౌకర్యాలు కలిపించాలని, ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సహాయం అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు షేక్ ఖాశీం, గౌరవ అధ్యక్షులు షేక్ సుభాని, పట్టణ అధ్యక్షులు టి.వెంకట్రావు, ఉపాధ్యక్షులు వీరాంజనేయులు, బాషా, బాజి, సెక్రటరీ చల్లా శేఖర్, కోశాధికారి టి.జయరాజ్, సహాయక కార్యదర్శి అలీసా, ప్రచార కమిటీ సభ్యులు షేక్ హసన్ బాబా, ఇమాంసా, ఎగ్జిక్యూటివ్ నెంబర్ ఆదిమూలం ప్రవీణ్, జానీ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

దుర్గి: మండలంలోని బుగ్గవాగు రిజర్వాయర్‌లో ఓ గుర్తు తెలియని మృతదేహం బుధవారం లభ్యమైనట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు దుర్గి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి సంబంధించిన సమాచారం కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

నాణ్యమైన మిర్చి విత్తనాలను అందజేయండి



మిర్చి విత్తనాల ప్రాసెస్‌ను పరిశీలిస్తున్న పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి మురళి

రెంటచింతల: నాణ్యమైన కాయల నుంచి తీసిన (ప్రాసెస్ చేసిన) విత్తనాలను మాత్రమే రైతులకు అందజేయాలని పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి అన్నారు. బుధవారం మండలంలోని పలు ప్రాసెస్ యూనిట్‌లను ఆయన ఏడీఏ రవికుమార్, స్థానిక వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూనిట్‌లో కాయల నుంచి ప్రాసెస్ చేసి మిర్చి విత్తనాలను ఏ విధంగా సేకరిస్తున్నారో (తీస్తున్నారో) పరిశీలించారు. ప్రాసెస్ చేసిన విత్తనాల మొలక శాతం ఎంత వరకు వచ్చిందో పరిశీలించారు. కాయల నుంచి తీసిన విత్తనాలకు సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేశారు. లక్షల రూపాయలతో పెట్టుబడి పెట్టి మిర్చి పంటను సాగు చేసే రైతులకు నాసిరకం విత్తనాలు అందజేస్తే.. అటువంటి వారిపై విత్తన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతందని హెచ్చరించారు. నాణ్యత విషయంలో రాజీ లేదని రైతుల నుంచి ఫిర్యాదు వచ్చినా.. అటువంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. యూనిట్‌లను సక్రమంగా నడిపి అధికారులకు అందుబాటులో ఉంచాలని సూచించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



జరావత్ బాలు నాయక్ మృతదేహం

వెల్దుర్తి: అప్పుల బాధతో ఓ గిరిజన రైతు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని శ్రీరాంపురంతండాలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జఠావత్ బాలు నాయక్ (33) వర్షాలు సరిగా పడకపోవటంతో పంటలు పండక రూ.12 లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. బాలునాయక్ తనకున్న ఎకరం పొలంతో పాటు 4 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని పత్తి, మిర్చి పంటలను సాగు చేశాడు. పంటలు సరిగా పండకపోవటంతో అప్పుల పాలయ్యాడు. చేసిన అప్పులను ఎలా తీర్చాలో అర్థంకాక మనస్థాపానికి గురై పొలంలో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బాలునాయక్ ఇంటికి రాకపోవటంతో సమీపంలోని పొలాల్లో వెతగ్గా పురుగుమందు తాగి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. బంధువులు హుటాహుటిన మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే బాలు నాయక్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఇతని భార్య బుజ్జి బాయి ఫిర్యాదు మేరకు వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

అంటువ్యాధుల నిర్మూలనలో అప్రమత్తంగా ఉండండి



కొప్పునూరు పీహెచ్‌సీలో సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

మాచర్ల రూరల్: గ్రామంలో ప్రబలుతున్న అంటు రోగాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని ఎప్పటికప్పుడు వైద్య శిబిరాలు నిర్వహిస్తూ రోగులకు తక్షణమే వైద్య సేవలందించేలా సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఎన్‌క్యూవీఏఎస్ టీం కన్వీనర్ డాక్టర్ ఎంఏ అనూప్ ఆదేశించారు. బుధవారం మండలంలోని కొప్పునూరు, నాగార్జున సాగర్ హెల్త్ సెంటర్లను వారు సందర్శించి మాట్లాడారు. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో గ్రామాల్లో డయేరియా, మలేరియా, డెంగీ, చికున్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉందని, ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత లేక డయేరియా కేసులు ఎక్కువగా వస్తున్నాయని, వీటి నివారణకు వైద్య సిబ్బంది ఎక్కడికక్కడ శిబిరాలు ఏర్పాటు చేసి వెంటనే వారికి ఆరోగ్య రక్షణ కల్పించాలని కోరారు. 108, 104 సిబ్బంది ప్రతి గ్రామంలో పర్యటించి రోగులకు తక్షణమే వైద్య సహాయమందించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాధుల నివారణలో రోగులకు సేవలందించటంలో కొప్పునూరు, విజయపురిసౌత్ పీహెచ్‌సీ సిబ్బంది పనితీరును ఆయన అభినందించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ క్వాలిటీ అస్యూరెన్సు స్టాండర్డ్ సెంట్రల్ సభ్యులు, వైద్యులు చైతన్య, రాంప్రసాద్, ఓరుగంటి ప్రవీణ్, ముక్తియార్ జాని, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దూరం

సత్తెనపల్లి: అతిసార వ్యాధి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వి.ప్రదీప్ అన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధి నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. సత్తెనపల్లి మండలం ఫణిదంలోని పీహెచ్‌సీలో ఒకటో తేదీ నుంచి ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా పేరిట అవగాహన సదస్సులు నిర్వహించేలా ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలు, పెద్దలకు వాంతులు, విరేచనాలు అయితే ఓఆర్ఎస్ ద్రావణాన్ని అందించాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు ప్రతి గ్రామంలో సంబంధిత ఆరోగ్య సిబ్బంది వద్ద అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీరు, క్లోరినేషన్ చేసిన నీటిని తాగాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో వర్షం, మురుగునీరు నిలువ లేకుండా చూడాలన్నారు. పరిసరాలను శుభ్రం చేసుకుని దోమలు పెరగకుండా అరికట్టుకోవాలని సూచించారు. వేడి ఆహార పదార్థాలను తినాలని, వండిన ఆహార పదార్థాలపై మూతలు ఉంచాలని తెలిపారు. గ్రామాల్లో వీటిపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించి, స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఎక్కువ సార్లు విరేచనాలు, వాంతులు అయితే వైద్యులను సంప్రదించేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఇంటిలోనూ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని, ఎవరైనా వ్యాధి లక్షణాలు కలిగి ఉంటే వెంటనే వైద్యం పొందాలని స్పష్టం చేశారు. డయేరియా వ్యాధి బారిన పడిన వారు ఓఆర్ఎస్ తీసుకొని, జింక్ టాబ్లెట్లను వేసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఆరోగ్య విస్తరణ అధికారి పి.శ్రీనివాసరావు, పీహెచ్ఎన్ జీవీసీకే మీనాక్షమ్మ, ఆరోగ్య పర్యవేక్షకురాలు ఏ వరలక్ష్మి, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాలు మంజూరు

శావల్యాపురం: మండలంలోని కారుమంచి, శావల్యాపురం పశు వైద్యశాలల్లో పాడిరైతులకు గడ్డిరకం జొన్న విత్తనాలను రాయితీపై ఇస్తున్నట్లు కారుమంచి సెక్టారు పశు వైద్యాధికారి సోముల గుణధీర్ తెలిపారు. బుధవారం మండలంలోని కారుమంచి గ్రామం పశు వైద్యశాలలో వైద్యాధికారి గుణధీర్ మాట్లాడుతూ కారుమంచి, వేల్పూరు, శావల్యాపురం తదితర పశు వైద్యశాలలకు ఏడు టన్నుల జొన్న విత్తనాలు రాయితీపై ఇవ్వడానికి ప్రభుత్వాన్ని కోరగా ప్రస్తుతానికి ఒక్కో టన్ను చొప్పున సరఫరా చేసినట్లు తెలిపారు. పాడి గేదెలు ఆధారంగా పశుగ్రాసం సాగు చేయు పాడిరైతులకు ఐదు కేజీల సంచి రూ.115 కు రాయితీపై ఇస్తున్నట్లు తెలిపారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టి డయేరియాను తరిమేద్దాం

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కుమార్‌రాజా



మంచికల్లు గ్రామంలో నీటి శ్యాంపిల్స్‌ను సేకరిస్తున్న దృశ్యం

మంచికల్లు(రెంటచింతల): గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపటి డయేరియాను తరిమేద్దామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కుమార్‌రాజా అన్నారు. గ్రామంలో ఇటీవల బోరు వాటర్ తాగడం వలన రెండు డయేరియా కేసులు వచ్చిన నేపథ్యంలో మరోసారి తాగునీటి నాణ్యత పరీక్ష నిమిత్తం శ్యాంపిల్స్‌ను సంబంధిత 5 బోర్ల నుంచి సేకరించి మాట్లాడారు. ప్రస్తుత వర్షా కాలంలో ఎక్కువగా గ్రామాలలో డయేరియా కేసులు అధికంగా వస్తున్నాయని ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. సేకరించిన నీటి నాణ్యత పరీక్ష ఫలితాలు వచ్చేంత వరకు ఆ నీటిని ఎవరూ తాగవద్దని ఆయన హెచ్చరించారు. కలుషితమైన నీటిని తాగడం వలన డయేరియా (అతిసార) వస్తుందన్నారు. గ్రామంలో అతిసార వ్యాధి వచ్చిన ప్రాంతాలలో గ్రామ పంచాయతీ వారు పారుశుద్ధ్య పనులను చేపట్టి, కచ్చితంగా శానిటేషన్ చేయాలని గ్రామ కార్యదర్శి సౌర్యకుమారికి సూచించడం జరిగిందన్నారు. ప్రస్తుత పరిస్థితులలో మినరల్‌వాటర్ తాగాలని అవసరమైతే కాచి చల్లార్చిన నీటిని తాగడం వలన డయేరియా దరి చేరదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, ఆరోగ్య కార్యకర్త విష్ణుప్రియ, గ్రామ పెద్దలు గోగుల పుల్లారెడ్డి, లక్ష్మారెడ్డి, పున్నారెడ్డి, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

వీఏఏ గొట్టం లక్ష్మారెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటాం

వీఏఏ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వెంకటరాజు



లక్ష్మారెడ్డి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న జిల్లా వీఏఏ అసోసియేషన్ అధ్యక్షులు, నాయకులు

రెంటచింతల: మండలంలోని రెంటాల గ్రామ వ్యవసాయ సహాయకులుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల అకాలమరణం పొందిన గొట్టం లక్ష్మారెడ్డి కుటుంబాన్ని అన్నివిధాల ఆదుకుంటామని పల్నాడు జిల్లా వీఏఏ అసోసియేషన్ అధ్యక్షులు పి.వెంకటరాజు అన్నారు. బుధవారం ఆయన సంఘం నాయకులతో కలిసి మిట్టగుడిపాడు గ్రామంలోని లక్ష్మారెడ్డి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేసి మాట్లాడారు. ధైర్యంగా ఉండాలని మీకు జిల్లా వీఏఏ అసోసియేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. లక్ష్మారెడ్డి కుటుంబంలో అర్హులైన ఒకరికి ప్రభుత్వ ఉద్యోగ అవకాశం కల్పించడానికి, ప్రభుత్వం తరపున వచ్చే బెనిఫిట్స్ వెంటనే మంజూరు చేయడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా వీఏఏ అసోసియేషన్ ఉపాధ్యక్షులు చల్లా సతీష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.ఫిలిప్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం.గురుబ్రహ్మం, వీఏఏలు డి.శంకర్, ఎం.పవన్, టి.కళ్యాణ్, ఎం.శేషు, పి.గురునాసర్ తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ కింద పండ్లతోటల పెంపకం



అంచులవారిపాలెం సమీపంలోని జామతోటను పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

రాజుపాలెం : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సన్న, చిన్నకారు రైతులు పండ్ల తోటలు వేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఎంపీడీవో ఎన్ రామకృష్ణప్రసాద్, ఏపీవో సీహెచ్ వెంకటేశ్వర్లులు తెలిపారు. మండలంలోని అంచులవారిపాలెం, అనుపాలెం గ్రామాలలో ఉపాధి హామీ పథకం ద్వారా వేసిన పండ్ల తోటలను రైతులతో కలసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని ఐదెకరాల లోపు పొలం ఉన్న రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. వారు జాబ్‌కార్డు కూడా కలిగి ఉండాలని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగం లేనివారికే ఈ అవకాశం ఉందని చెప్పారు. పండ్లతోట వేసుకునే రైతులు శాశ్వత నీటి సౌకర్యం, బోరు బావులు కలిగి ఉండాలని తెలిపారు. మండలంలోని 17 ఎకరాలలో పండ్ల తోటలు వేశారని చెప్పారు. మామిడి, జీడి మామిడి, బత్తాయి, కొబ్బరి, మునగ, సపోట, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, జామ, తైవాన్‌జామ, నిమ్మ, నేరేడు, యాపిల్‌బేర్, అంజూర మొదలైన తోటలు వేసుకోవచ్చని తెలిపారు. పూల తోటల పెంపకం కింద గులాబీ, గుండుమల్లె తోటలు వేసుకోవచ్చని తెలియజేశారు. ఆసక్తిగల రైతులు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోను, ఏపీవోను సంప్రదించాలని కోరారు.

మహాసభ కరపత్రాల ఆవిష్కరణ



సత్తెనపల్లి: మాదిగ జన జాతర మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు రెడ్డెబోయిన ప్రసన్నకుమార్ మాదిగ పిలుపునిచ్చారు. పట్టణంలోని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద బుధవారం జన జాతర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాదిగ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ 30వ వార్షికోత్సవం సందర్భంగా ఈదుముడి గ్రామంలో వ్యవస్థాపకుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ నాయకత్వంలో సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు చింతపల్లి గంగాధర్ ఆధ్వర్యంలో 7న జరిగే ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా కన్వీనర్ పేరుపోగు రామయ్య మాదిగ, పల్నాడు జిల్లా కో కన్వీనర్ గుండాల నగేష్ మాదిగ, సత్తెనపల్లి నియోజకవర్గ నాయకుడు చింతపల్లి నాగరాజు మాదిగ, గర్నెపూడి ఆనంద్ మాదిగ, దారా మరియదాస్ మాదిగ, గడ్డిపర్తి సుందరరావు మాదిగ, చిలక రాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు టార్పాలిన్‌లు పంపిణీ



అమరావతి: అత్తలూరు ఆర్గానిక్స్ ద్వారా మండల పరిధిలోని పలు గ్రామాల రైతులకు సంస్థ తరఫున అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం మండలంలోని మల్లాది గ్రామంలో ఆర్గానిక్ వ్యవసాయం చేస్తున్న 29 మంది రైతులకు మిరపకాయలు ఆరబోసుకునేందుకు అవసరమైన టార్పాలిన్ పట్టాలను పంపిణీ చేశారు. క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెంపా జ్వాలాలక్ష్మీనరసింహారావు చేతుల మీదుగా రైతులకు పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంపా వాసులతో పాటు గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.